నమస్తే తెలంగాణ
# సంగారెడ్డి
I | హైదరాబాద్, మంగళవారం 9 జూలై 2024 | SANGAREDDY



- మెదక్ జిల్లాలో ప్రతిరోజూ 12వేల లీటర్లు పాలు తాగితే.. 30 వేల లీటర్ల మద్యం తాగుతున్నారు..
- ఆరు నెలల్లో రూ.291కోట్ల మద్యం అమ్మకాలు..
- మందుకే ఎక్కువ ఖర్చు చేస్తున్న ప్రజలు
- ఏటా పెరుగుతున్న లిక్కర్ విక్రయాలు



# పాల కంటే మందుకే ఎక్కువ గిరాకీ..!

మెదక్, జూలై 8 (నమస్తే తెలంగాణ) : మెదక్ జిల్లాలో పాలు, టీ, కాఫీ రూపంలో రోజూ సుమారు 1200 లీటర్ల పాలు తాగుతుండగా.. మద్యం వాడకం మాత్రం దానికి రెట్టింపుగా ఉంది. పాలకు రెండు రేట్లు అధికంగా విస్కీ, బ్రాందీ, బీర్, వైన్ ఇలా అన్ని రకాల లిక్కర్ కలిపి దాదాపు 30వేల లీటర్ల వరకు మందుబాబులు తాగేస్తున్నారు. ఒకప్పుడు ఉదయం లేవగానే టీ లేనిదే మహిళలు, ప్రజలు పొలం పనులకు వెళ్లేవారు కాదు. అయితే మందు ఎప్పుడో ఒకసారి ముట్టుకునే వారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. పట్టణాలు, పల్లెలు అనే తేడా లేకుండా ఎప్పుడు తెల్లవారుతుందా.. 10 గంటలు ఎప్పుడు అవుతుందా అని ఎదురుచూస్తున్నారు మందుబాబులు. ఇదిలావుండగా పట్టణాలతోపాటు పల్లెల్లో కూడా మద్యం దుకాణాలు వెలియడంతో ఇక మందుకు తక్కువేమిలేదు అన్నట్టు ఉంది. కొన్ని సంవత్సరాలుగా మద్యం తాగే వారి సంఖ్య పెరుగుతూనే ఉంది. వృద్ధులతో పోటీగా యువత కూడా మద్యానికి అలవాటు పడడడంతో అమ్మకాలు జోరందుకున్నాయి.

**ఆరు నెలల్లో రూ.291కోట్ల లిక్కర్ అమ్మకాలు**

మెదక్ జిల్లాలో 49 మద్యం దుకాణాలు, 4 బార్లు ఉన్నాయి. జనవరి నుంచి జూన్ వరకు రూ.291.31 కోట్ల వ్యాపారం జరిగింది. ఇదీ మరింత పెరిగి సెప్టెంబర్ వరకు రూ.350 కోట్లకు చేరనుంది. ఒక విస్కీ, బ్రాందీ ఫుల్ బాటిల్ 750 ఎంఎల్ అంటే 12 ఫుల్ బాటిళ్లతో కూడిన కాటన్‌లో 9 లీటర్ల మద్యం ఉంటుంది. ఈ విధంగా ఆరు నెలల్లో అమ్మిన కాటన్లు 300312 విక్రయించారు. ఒక్కో బీర్ 650 ఎంఎల్, ఒక్కో పెట్టెలో 12 బీర్ల చొప్పున లెక్కిస్తే 7.8 లీటర్లు. ఆరు నెలల్లో అమ్మిన బీరు కేసులు 4,66,549 మద్యం మందుబాబులు తాగినట్లు లెక్కా. మొత్తంగా ఆరు నెలల వ్యవధిలోనే రూ.291.31 కోట్ల వ్యాపారం జరిగింది.

**రోజూ 1200 లీటర్ల పాలు అమ్ముతున్నారు..**

మెదక్ జిల్లాలో రోజూ 1200 లీటర్ల పాలు అమ్ముతున్నారు. జిల్లాలో 120 కేంద్రాలు ఉండగా, ఇందులో 7 బీఎంసీ(చిన్న తరహా పాత శీతల కేంద్రాలు) ఉన్నాయి. మెదక్, రామాయంపేట, చేగుంట, వడియారం, పాపన్నపేట, పెద్దశంకరంపేట, రేగోడ్, కొడిపల్లి కేంద్రాలు నడుస్తున్నాయి. మొత్తంగా 1600 మంది రైతులు రోజూ పాలను కేంద్రాలకు సరఫరా చేస్తున్నారు. ఇంట్లో పాలు తాగే చంటి పిల్లలున్నా, ఇన్ని హోటళ్లు, టీ పాయింట్లు నడుస్తున్నా ఒక్కొక్కరు రోజుకు రెండు లేదా మూడు సార్లు టీ, కాఫీ తాగుతున్నా మెదక్ జిల్లాలో రోజూ 1200 లీటర్ల పాలు మాత్రమే అమ్ముడుపోతున్నాయి. ప్రస్తుతం లీటరు పాల ధర రూ.60 పలుకుతున్నది.



## పాలకు మించి మద్యం తాగేస్తున్నారు..

- సంగారెడ్డి జిల్లాలో పాలకంటే అధికంగా మద్యం అమ్మకాలు
- జిల్లాలో ప్రతిరోజూ 50వేల లీటర్లకు పైగా పాలు అమ్మకం
- పాలతో పోల్చుకుంటే పదిరెట్లు పెరిగిన మద్యం

సంగారెడ్డి జూలై 8(నమస్తే తెలంగాణ): ఆరోగ్యకరమైన పాలకంటే లిక్కర్ అమ్మకాలు సంగారెడ్డి జిల్లాలో జోరుగా సాగుతున్నాయి. దీంతో పాలకంటే మద్యం అమ్మకాలు పదింతలు పెరిగాయి. వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ ప్రకారం ప్రతిఒక్కరూ 180 మిల్లీలీటర్ల నుంచి 260 మి.లీటర్ల పాలు తాగాలి. జిల్లాలో ప్రతిరోజూ 50వేల లీటర్లకుపైగా పాల అమ్మకాలు జరుగుతున్నాయి. విజయ డెయిరీ రోజూ 4892 మంది నుంచి 9545 లీటర్ల పాలు సేకరించి అమ్ముతుంది. ఇతర డెయిరీలు, డెయిరీ వ్యాపార సంస్థలు రోజూ 20వేల లీటర్ల వరకు పాలు అమ్మకాలు జరుపుతున్నాయి. అయితే పాల ను మించి జిల్లాలో మద్యం అమ్మకాలు సాగుతున్నాయి. రోజూ 70వేల లీటర్లకుపైగా మద్యాన్ని మందుబాబులు తాగేస్తున్నారు. దీంతో మద్యం అమ్మకాలు 20 శాతం పెరిగాయి. రోజూ జిల్లాలో రూ.5 కోట్ల వరకు మద్యం అమ్మకాలు సాగుతున్నాయంటే మ ద్యంప్రియులు పాలపై కంటే మద్యంపై ఎంత ఖర్చు చేస్తున్నారో ఇట్టే అర్థం చేసుకోవచ్చు. సంగారెడ్డి జిల్లాలో గతేడాదిలో 90,9,042 కేసుల మద్యం, 13,38, 822 కేసుల బీర్లు అమ్ముడుపోయాయి. వీటి విలువ రూ.900 కోట్ల వరకు ఉంటుంది. డిసెంబర్ 2023 నుంచి జూన్ 2024 వరకు సంగారెడ్డి జిల్లాలో 10,4, 4643 కేసుల లిక్కర్, 14,12,274 కేసుల బీర్లు అమ్ముడుపోయాయి. వీటి విలువ రూ.1002. 01 కోట్లు ఉంటుంది. గతేడాదితో పోలిస్తే సంగారెడ్డి జిల్లాలో లిక్కర్ అమ్మకాలు 20శాతంపైగా పెరిగాయి. లిక్కర్ అమ్మకాలు 14.92 శాతం, బీరు అమ్మకాలు 5.49 శాతం పెరిగాగాయి. మద్యం అమ్మకాలపై ఆదాయం సైతం గతేడాదితో పోలిస్తే 11.25 శాతం పెరిగింది. సంగారెడ్డి జిల్లాలో 101 మద్యం దుకాణాలు, 101 పర్మిట్‌రూమ్‌లు ఉన్నాయి. నిబంధనల మేరకు మద్యం దుకాణాల్లో మాత్రమే మద్యం అమ్మకాలు జరిగాలి. అయితే నిబంధనలకు విరుద్ధంగా ప్రతి గ్రామంలో బెల్టుషాపులు నడుస్తున్నాయి. ఒక వైన్‌షాపు పరిధిలో 20 నుంచి 40 వరకు బెల్టుషాపులు గ్రామాల్లో కొనసాగుతున్నాయి. దీంతో గ్రామాలు, పట్టణాల్లో మందు తాగే వారి సంఖ్య పెరుగుతుండటంతో గొడవలు, నేరాలు పెరుగుతున్నాయి.

# కదంతొక్కిన కార్మికులు

- సీఐటీయూ ఆధ్వర్యంలో సిద్దిపేట కలెక్టరేట్ ముట్టడి
- పెండింగ్ వేతనాలు చెల్లించాలని పంచాయతీ కార్మికుల నిరసన
- రెండు గంటల పాటు గ్రీవెన్స్‌సెల్ కు ఆటంకం
- జీతాలు చెల్లించకపోతే నిరవధిక సమ్మె చేస్తామని హెచ్చరిక
- కలెక్టర్ హామీతో ఆందోళన విరమణ



సిద్దిపేట కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న గ్రామ పంచాయతీ కార్మికులు

సిద్దిపేట కలెక్టరేట్, జూలై 8: పెండింగ్ వేతనాలు చెల్లించాలని సిద్దిపేట జిల్లా వ్యాప్తంగా 499 గ్రామ పంచాయతీల్లో పని చేస్తున్న కార్మికులు సోమవారం కలెక్టరేట్‌ను ముట్టడించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సందబోయిన ఎల్లయ్య, సహాయ కార్యదర్శి రవికుమార్ మాట్లాడుతూ జిల్లాలో గ్రామ పంచాయతీ సిబ్బందికి 10 నెలల నుంచి జీతాలు చెల్లించకపోవడం వల్ల కుటుంబాలను పోషించుకోవడానికి అప్పులు చేయాల్సి వస్తుందన్నారు. పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. వేతనాలు చెల్లించకపోతే జిల్లా వ్యాప్తంగా పోరాటాన్ని ఉధృతం చేస్తామన్నారు. అవసరమైతే నిరవధిక సమ్మె చేస్తామని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులకు 5 లక్షల ఇన్సూరెన్స్ పథకాన్ని, మల్టీపర్పస్ విధానం రద్దు చేసి పాత కేటగిరీలను కొనసాగించాలన్నారు. గ్రామపంచాయతీ కార్మికుల్లో అధికంగా దళితులు, బలహీన వార్గలకు చెందిన పేద కార్మికులు సంవత్సరాల తరబడి పని చేస్తున్నా, ఇంతవరకు పర్మినెంట్‌కు నోచుకోలేదన్నారు. అనంతరం కలెక్టర్‌కు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందించారు. కలెక్టర్ సమస్యల పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ముట్టడిలో యూనియన్ జిల్లా కార్యదర్శి మహేశ్, యూనియన్ జిల్లా అధ్యక్షుడు కొమురయ్య, గ్రామ పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.



సీఐటీయూ ఆధ్వర్యంలో సిద్దిపేట కలెక్టరేట్‌ను ముట్టడిస్తున్న గ్రామ పంచాయతీ కార్మికులు

# సబ్ స్టేషన్ ముట్టడి



చిప్పతుర్తి గ్రామంలో సబ్ స్టేషన్‌ను ముట్టడిస్తున్న రైతులు, గ్రామస్తులు

- మెదక్ జిల్లా చిప్పల్ తుర్తి సబ్ స్టేషన్‌ను ముట్టడించిన రైతులు, గ్రామస్తులు
- రోజుకు 20సార్లు ట్రిప్ అవుతున్నా పట్టించుకోని విద్యుత్ అధికారులు
- అస్తమానం ట్రిప్ కావడంతో మోటర్లు, ఫ్రిజ్‌లు, టీవీలు కాలిపోతున్నాయని ఆవేదన
- సమస్యలు పరిష్కరిస్తామన్న డిప్యూటీ ఏడీ

నర్సాపూర్, జూలై 8: పొలాలకు, ఇంటి అవసరాలకు విద్యుత్ సక్రమంగా రాకపోవడంతో రైతులు సబ్ స్టేషన్‌ను ముట్టడించిన ఘటన మండలంలోని చిప్పల్‌తుర్తిలో సోమవారం చోటుచేసుకుంది. రైతులు తెలిపిన వివరాల ప్రకారం.. చిప్పల్‌తుర్తిలోని సబ్‌స్టేషన్‌ను సుమారు వందమంది రైతులు, గ్రామస్తులు ముట్టడించి నిరసన వ్యక్తం చేశారు. గ్రామంలో తీగలు వేలాడుతున్నా విద్యుత్ అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ తీగలకు చెట్ల కొమ్మలు తగలడంతో రోజుకు 20సార్లు ట్రిప్ అవుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. ఆదివారం మధ్యాహ్నం ఒంటిగంటకు పోయిన కరెంట్ సోమవారం ఉదయం 9 గంటల వరకు రాకపోవడంతో రైతులు, గ్రామస్తులు ఇబ్బందులు ఎదుర్కోవలసి వచ్చిందని వెల్లడించారు. అస్తమానం కరెంట్ ట్రిప్ కావడంతో మోటర్లు, ఫ్రిజ్‌లు, టీవీలు కాలిపోతున్నాయని, కరెంట్ సక్రమంగా రాకపోవడంతో పొలాలకు నీరు అందించడం ఇబ్బందిగా మారిందన్నారు. పై నుంచి కరెంట్ బాగానే ఉన్నప్పటికీ సబ్‌స్టేషన్ సిబ్బంది నిర్లక్ష్యంతో నష్టం వాటిల్లుతున్నదన్నారు. గ్రామాల్లో కట్ పాయింట్ లేకపోవడంతో ఎల్‌సీ తీసుకుంటే మూడు గ్రామాలకు కరెంట్ నిలిచిపోతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుల ముట్టడిని తెలుసుకున్న డిప్యూటీ ఏడీ అక్కడకు వచ్చి సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో రైతులు, గ్రామస్తులు వెనుతిరిగారు.

# కాంగ్రెస్‌లో నామినేటెడ్ పదవుల చిచ్చు

- కార్పొరేషన్ చైర్మన్ పదవుల్లో మెదక్ జిల్లాకు మొండిచేయి
- నిరాశలో పలువురు సీనియర్ నాయకులు
- పార్టీని నమ్ముకున్న వారికి పదవులు ఇవ్వాలని డిమాండ్
- సీఎం, మంత్రులు, ముఖ్యనేతలను కలుస్తున్న ఆశావహులు


మెదక్, జూలై 8 (నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్‌లో నామినేటెడ్ పదవులు చిచ్చురేపాయి. పార్టీని నమ్ముకొని పనిచేసిన వారికి తొలి విడుతలోనే షాక్ తగిలింది. కార్పొరేషన్ చైర్మన్ పదవుల కేటాయింపులో న్యాయం జరగలేదని సీనియర్లు అసంతృప్తిలో ఉన్నారు. ఇంత కాలం పార్టీకి వెన్నంటి ఉన్నా, తమకు తగిన గౌరవం దక్కలేదని ఆవేదన చెందుతున్నారు. సోమవారం రాష్ట్రస్థాయి కార్పొరేషన్ పదవుల కేటాయింపు తర్వా త సీనియర్ నాయకులు నారాజ్ అయ్యారు. అసెంబ్లీ ఎన్నికల ముందు పార్టీ గెలుపు కోసం పనిచేస్తే మంచి అవకాశాలు ఉంటాయని నేతలు ఇచ్చిన హామీల ప్రకారం తమకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరుతున్నారు. కాంగ్రెస్‌అధికారంలోకి వచ్చిన తర్వాత మెదక్ జిల్లాలోని మెదక్, నర్సాపూర్ నియోకవర్గాలకు చెందిన నేతలు నామినేటెడ్ పదవుల కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. ఇంతవరకు ఒక్కరికీ కూడా పదవి దక్కలేదు.

**మెదక్ జిల్లాకు మొండిచేయి**

తాజాగా ప్రభుత్వం ప్రకటించిన రాష్ట్రస్థాయి కార్పొరేషన్ పదవుల్లో మెదక్ జిల్లాకు మొండిచేయి చూపించారు. మెదక్ నియోజకవర్గం నుంచి రామాయంపేటకు చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సుప్రభాత్‌రావు, పల్లె రాంచందర్ గౌడ్, ఎన్నికల సమయంలో బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన ఎలక్షన్‌రెడ్డి, నర్సాపూర్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి, డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్, మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, సుహాసినిరెడ్డితోపాటు ఇంకా పలువురు సీనియర్లు నామినేటెడ్ పదవుల కోసం వేచి చూస్తున్నారు.

**పార్టీని నమ్ముకున్న వారికి పదవులు ఇవ్వాలి**

పార్టీని నమ్ముకున్న వారికి పదవులు ఇవ్వాలని కాంగ్రెస్ సీనియర్ నాయకులు అధిష్టానాన్ని వేడుకుంటున్నారు. ఇప్పటికే కొంత మంది నాయకులు సీఎం రేవంత్‌రెడ్డిని, జిల్లా మంత్రులను కలుస్తున్నారు. కార్పొరేషన్ చైర్మన్ పదవులు ప్రకటించిన వెంటనే కొందరు నాయకులు హైదరాబాద్‌లో ముఖ్య నేతలను కలుస్తున్నారు. పదేండ్లపాటు కాంగ్రెస్‌లో ఉంటూ పార్టీ కోసం కష్టపడి పనిచేసిన వారికి పదవుల్లో అన్యాయం చేయవద్దని ఒత్తిడి తెస్తున్నారు. ఇదిలావుండగా మార్కెట్ కమిటీ పాలకవర్గాల పదవుల్లో కూడా తీవ్రమైన పోటీ ఉన్నట్లు తెలుస్తోంది. మెదక్ జిల్లాలో కార్పొరేషన్ చైర్మన్ పదవులు ఎవరిని వరించనున్నాయో వేచిచూద్దాం..



# పాలు లేని గ్రామాలుండొచ్చు.. మద్యం లేని పల్లెలు లేవు

దుబ్బాక, జూలై 8 : 'మద్యపానం ఆరోగ్యానికి హానికరం' అంటూ వైద్యులు సూచిస్తున్నారు. అంతేగాక మద్యం సీసాలపైనా ఎర్రటి అక్షరాలతో హెచ్చరిక ఉన్నప్పటికీ ఇదేమి మందుబాబులు పట్టించుకోవడం లేదు. పాలు లేని గ్రామాలైన ఉండోచ్చు కానీ మద్యం లేని పల్లెలు లేకపోవడం గమనార్హం. పాల కంటే లిక్కరు తాగేందుకు మందుబాబులు ఆసక్తి చూపిస్తున్నారు. అన్నం లేకున్నా ..అప్పులు చేసైనా ..మందు వాసన చూడకుండా ఉండలేమని మద్యానికి వ్యసనపరులుగా మారుతున్నారు. రోజురోజుకూ గ్రామాల్లో మద్యానికి బానిసలుగా మారి అప్పులపాలవుతున్నారు. గతంలో పట్టణాల్లో మాత్రమే మద్యం దుకాణాలు ఉండేవి. ఇప్పుడు పల్లెల్లో సైతం బెల్టు దుకాణాలు వెలిశాయి. పాలు అందుబాటులో లేకున్నా... మ ద్యం మాత్రం మారుమూల పల్లెలో సైతం లభిస్తుంది. ప్రభుత్వానికి ప్రధాన ఆదాయం మద్యం విక్రయం. ప్రజా ఆరోగ్యాన్ని మరిచి ప్రభుత్వ ఖజానకు ఆదాయం సమకూర్చడమే లక్ష్యంగా నూతన మద్యం పాలసీలు ప్రవేశపెడుతున్నారు. దీంతో గ్రామాల్లో మద్యం విక్రయాలు జోరందుకున్నాయి. మద్యం విక్రయాలను ప్రోత్సహించేందుకు ఆబ్కారి శాఖ అధికారులు నిబంధనలను పక్కన బెడుతున్నారు. జనాభా ఆధారంగా వైన్సు దుకాణాలతోపాటు బార్‌లను పెంచేశారు. గతంలో మండలకేంద్రాల్లో మాత్రమే మద్యం లభించేది. ఇప్పుడు పల్లెల్లో మద్యం సీసాలకు కొదవలేకుండా పో యింది. బెల్టు దుకాణాలు విచ్చలవిడిగా పెరిగిపోయాయి. వైన్స్ నిర్వాహకులు గ్రామాలకు ప్రత్యేక వాహనాల్లో మద్యం బాటిళ్లు డెలివరీ చేస్తూ..విక్రయాలు జోరుగా నిర్వహిన్నారు. కిరాణ దుకాణాల్లో, కల్లు దుకాణాల్లో మద్యం సీసాలు విక్రయిస్తున్నారు.



దుబ్బా క మండలం చీకోడు గ్రామంలో ఓ పర్మిట్ రూం వద్ద.. పిల్లాడిని పక్కనే కూర్చోబెట్టుకుని మద్యం తాగుతున్న దృశ్యం



అర్జీలు స్వీకరిస్తున్న సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి

# ప్రజావాణికి వెల్లువెత్తిన అర్జీలు

**స్వీకరించిన సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి**

సంగారెడ్డి కలెక్టరేట్, జూలై 8: సంగారెడ్డిలో ఇండోర్ స్టేడియం ఏర్పాటు చేయాలని మంజీరా స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు మాణయ్య, విఠల్ అధికారులకు విజ్ఞప్తి చేశారు. సోమవారం కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాల్‌లో నిర్వహించిన ప్రజావాణికి సంగారెడ్డి జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన అర్జీదారులు తమ ఫిర్యాధులను అందజేసి సమస్యలు పరిష్కరించాలని కోరారు. మంజీరా స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేస్తూ సంగారెడ్డిలో ఇండోర్ స్టేడియం, 400మీటర్ల రన్నింగ్ ట్రాక్ ఏర్పాటు చేయాలని కోరారు. పట్టణంలో జాతీయ, అంతర్జాతీయ స్థాయికి వెళ్లిన క్రీడాకారులు ఉన్నారని, గతంలో ఉన్న స్పోర్ట్స్ అకాడమీలు క్రమంగా ఇక్కడి నుంచి తరలిపోయాయని వివరించారు. ప్రజావాణిలో మొత్తం 79 అర్జీలు అందాయి. ఇందులో రెవెన్యూ శాఖ నుంచి 29 అర్జీలు రాగా, ఆరోగ్య శాఖ 11, విద్యాశాఖ 8, సంక్షేమ శాఖ 6, పంచాయతీ రాజ్ 12, డీఆర్డీవో నుంచి 13 అర్జీలు వచ్చాయి. ఆయా దరఖాస్తులను అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురీలతో కలిసి స్వీకరించిన కలెక్టర్ వాటిని సకాలంలో పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో అందిన అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలించి, ఆయా సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, డీఆర్వో పద్మజారాణి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన సమీక్షా సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో 80 మేరకు జిల్లాస్థాయి బదిలీలు ఈనెల 20లోగా పూర్తి చేయాలన్నారు. జిల్లాలో సర్వీసు పూర్తి చేసుకున్న రాష్ట్రస్థాయి అధికారుల వివరాలు, జిల్లాస్థాయి సిబ్బంది వివరాలు, ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా సమర్పించాలన్నారు.

# అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

- మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్
- ప్రజావాణిలో 184 దరఖాస్తుల స్వీకరణ



ప్రజావాణిలో దరఖాస్తులను స్వీకరిస్తున్న మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్, జూలై 8 (నమస్తే తెలంగాణ): మెదక్ జిల్లావ్యాప్తంగా ప్రజావాణిలో వచ్చిన అర్జీలను సంబంధిత అధికారులు సత్వరమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కలెక్టర్ రాహుల్ రాజ్, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు జిల్లాలోని ఆయా ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ప్రజలు ఎన్నో వ్యయ ప్రయాసాలకోర్చి సమస్యల పరిష్కారానికి దూరప్రాంతాల నుంచి వస్తుంటారని, వారి సమస్యలను సంబంధిత అధికారులు సత్వరమే పరిష్కరించాల్సిన అవసరం ఉన్నదన్నారు. ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తులను అధికారులకు అందజేశారు. భూ సమస్యలకు సంబంధించి 48, పెన్షన్‌కు సంబంధించి 20, డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల కోసం 47 దరఖాస్తులు, జీవనోపాధి సమస్యలపై 5, ఇతర సమస్యలకు సంబంధించి 64 దరఖాస్తులతో కలిపి మొత్తం 184 దరఖాస్తులు స్వీకరించామని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో డీఆర్డీవో శ్రీనివాసరావు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులను పరిష్కరించాలి

**సిద్దిపేట కలెక్టర్ మను చౌదరి**

సిద్దిపేట కలెక్టరేట్, జూలై 8: ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను త్వరగా పరిష్కరించేందుకు సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని సిద్దిపేట కలెక్టర్ మనుచౌదరి సూచించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి లో భాగంగా అదనపు కలెక్టర్లు గరిమా అగర్వాల్, శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ఆయన ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు తమ సమస్యలు పరిష్కారమవుతాయనే నమ్మకంతో ప్రజావాణి కార్యక్రమానికి వస్తున్నారన్నారు. ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్‌వో నాగరాజమ్మ, డీఆర్డీఏ పీడీ జయదేవ్ ఆర్యా, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.